ఫొటోగ్రఫీ, కళా ప్రదర్శన పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం లీగల్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన 'అందరికీ న్యాయం - న్యాయ సహాయం దృష్టిలో' థీమ్‌తో దేశవ్యాప్తంగా ఫొటోగ్రఫీ, ఆర్ట్ షోకేస్ ప్రారంభమైందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయ సహాయం ప్రభావాన్ని సృజనాత్మకంగా ప్రతిబింబించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పోటీలో ఫొటోలు, పెయింటింగ్‌లు, స్కెచ్‌లు, గరిష్టంగా ఒక నిమిషం నిడివి గల చిన్న వీడియోలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గౌరవంతో జీవన హక్కు, రోజువారీ జీవితంలో న్యాయం, న్యాయానికి దారితీసే మార్గాలు, భవిష్యత్ దిశగా న్యాయ సహాయం అనే నాలుగు ఉప థీమ్‌ల్లో ఎంట్రీలు సమర్పించవచ్చని తెలిపారు. విద్యార్థులు, న్యాయవాదులు, కళాకారులు, ప్రజలు పాల్గొనవచ్చని తెలిపారు. అక్టోబర్ నాలుగో తేదీ లోగా కార్యాలయానికి అందజేయాలని కోరారు. ఉత్తమ ఎంట్రీలను రాష్ట్ర, ఆపై జాతీయ స్థాయికి పంపిస్తామని తెలిపారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..?

డిగ్రీ విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ గ్రహణం పట్టుకుంది. గత విద్యా సంవత్సరంలో మూడు విడతలు, ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు ఒక విడత రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. టిడిపి కూటమి ప్రభుత్వం వాటి చెల్లింపు ఊసెత్తడం లేదు. ఫలితంగా ప్రైవేటు కళాశాలల నిర్వహణ భారంగా మారుతోంది. ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్, నిర్వహణ ఇతర ఖర్చుల కోసం అప్పులు చేస్తూ యాజమాన్యాలు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది.

- పేరుకుపోతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- సంక్షోభంలో డిగ్రీ విద్య
- అప్పులతో నిర్వహిస్తున్న ప్రైవేట్ కళాశాలలు

బిఆర్ఎయు ఎదుట ఆందోళన చేస్తున్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఉన్నత విద్యలో డిగ్రీ విద్య కీలకం. శ్రీకాకుళం వంటి గ్రామీణ ప్రాంత జిల్లాలో డిగ్రీ విద్యకు విద్యార్థులు ప్రాధాన్యమిస్తున్నారు. డిగ్రీ విద్యలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆధారంగా 80 శాతం మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో 16 ప్రభుత్వ, 84 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. మొదటి ఏడాది ప్రవేశ ప్రక్రియ కొనసాగుతోంది. రెండు, మూడేళ్లలో 20 వేల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. డిగ్రీలో బిఎ, బికాం, బిఎస్‌సి, ఇతర ఒకేషనల్ డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నారు. కోర్సు బట్టి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఫీజు స్ట్రక్చర్ ఉంది. ఈ ఫీజును ప్రభుత్వం సంవత్సరానికి నాలుగు విడతల్లో చెల్లిస్తుంది. ప్రస్తుతం సకాలంలో ఫీజులు చెల్లింపు జరగడం లేదు. బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో ప్రైవేట్ కళాశాలు అప్పుల్లో చిక్కుకుంటున్నాయి. కొన్ని కళాశాలలు డిగ్రీ చివరి ఏడాదిలో రిలీవైన విద్యార్థుల నుంచి ఫీజులు చెల్లిస్తేనే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నాయి. ప్రస్తుతం రీయింబర్స్‌మెంట్ పథకం అమలు తీరు గాడి తప్పింది. డిగ్రీలో ప్రతి సంవత్సరం రెండు సెమిస్టర్లు ఉంటాయి. పరీక్షలతో కలిపి 120 రోజులు సెమిస్టర్ కాలం. ఈ సమయంలో రెండు విడతల ఫీజులు చెల్లించాలి. ఇలా సెమిస్టర్ ఎండింగ్ నాటికి బకాయిలు లేకుండా చెల్లింపులు చేయాలి. అప్పుడు మాత్రమే సమస్య ఉండదు.

ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు విడతల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి. ఈ ఏడాది 2026-26 విద్యా సంవత్సరంలో ఒక్కవిడత సైతం చెల్లింపులు జరగలేదు. మొత్తం నాలుగు విడతల చెల్లింపులు జరిగాయి. ప్రైవేట్ కళాశాలలో నిర్వహణకు అప్పులు చేయాల్సి వస్తుంది. దీంతో ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ నిర్వహణ వంటి ఖర్చులు భారంగా మారుతున్నాయి. గత ప్రభుత్వం బకాయిల చెల్లింపునకు చర్యలు చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇంకా నాలుగు విడతలు చెల్లించాల్సి ఉంది. జిల్లా డిగ్రీ కళాశాలకు రూ.80 కోట్ల వరకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యాలు అంచెలంచెలుగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం త్వరలో చెల్లింపులు చేయనున్నట్లు ప్రకటించింది. చెల్లింపుల కోసం ప్రైవేట్ కళాశాలలో ఎదురుచూస్తున్నాయి. మరోవైపు డిగ్రీ విద్య సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. మొదటి ఏడాది ప్రవేశాలపై ప్రభావం చూపుతుంది. గతంతో పోల్చుకుంటే డిగ్రీ ప్రవేశాలు తగ్గుతున్నాయి. కొన్నాళ్ల కిందట 15 వేలు దాటి ప్రవేశాలు జరిగేవి. ప్రస్తుతం పది వేల లోపు ప్రవేశాలు జరుగుతున్నాయి. డిగ్రీ విద్య సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉంటుంది.

బకాయిల కోసం చూస్తున్నాం

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు కోసం ఎదుచూస్తున్నాం. ప్రభుత్వం స్పందించి అందజేయాలి. విద్యా సంవత్సరం పూర్తయ్యేసరికి చెల్లించకపోతే కళాశాలల నిర్వహణ కష్టం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, కళాశాలల నిర్వహణకు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను యూనియన్ తరుపున విద్యాశాఖ దృష్టికి తీసుకువెళ్లాం.

- పొన్నాన జయరాం
ఎపి ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు

అప్పలతో నడుపుతున్నాం

డిగ్రీ కళాశాలను అప్పులతో నిర్వహిస్తున్నాం. నాలుగు విడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ విద్యా సంవత్సరం సగం పూర్తయింది. అధ్యాపకుల జీతాలు, నిర్వహణ వంటి ఖర్చులు భారంగా మారుతున్నాయి. డిగ్రీ విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలి. బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలి.

- కోత మురళీధర్,
ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ అసోసియేషన్ ప్రాంతీయ కోఆర్డినేటర్

త్వరలో చెల్లింపులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుపై ఆందోళన అవసరం లేదు. విడతల వారీగా ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రతి కళాశాలకు చెల్లింపు ఉంటుంది. జ్ఞానభూమి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు పరిష్కరించి, అర్హత గల ప్రతి విద్యార్థికి చెల్లిస్తాం.

- మధుసూదనరావు,
సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు

జాషువా చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సాహిత్య, సాంస్కృతిక వేదిక ప్రతినిధులు

నవంబరు 11 నుంచి
సిక్కోలు పుస్తక మహోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో గల ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నవంబరు 11 నుంచి 20వ తేదీ వరకు సిక్కోలు పుస్తక మహోత్సవ సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక సంబరాలు నిర్వహించనున్నట్లు సాహిత్య, సాంస్కృతిక వేదిక ప్రతినిధులు ప్రకటించారు. నగరంలోని యుటిఎఫ్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విస్తతస్థాయి సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. ఇందులో భాగంగా వంద ప్రచురణ సంస్థలు తమ బుక్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, పుస్తక ప్రియులకు పండగ వాతావరణం సృష్టించనున్నాయి. పది రోజుల పాటు ప్రతినిత్యం సాహిత్య సభ, పుస్తకావిష్కరణలు, పుస్తక పరిచయాలు, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నారు. జిల్లా సంస్కృతిని ప్రతిబింబించే తప్పెటగుళ్ళు, జముకులు, కోలాటం, పగటివేషం, నాటికలు, నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, ఏకపాత్రాభినయాలు ప్రతిరోజు కళాభిమానులను అలరించనున్నాయి. పాఠశాల, కళాశాలల విద్యార్థుల సైన్స్ ప్రయోగాలు, ఆవిష్కరణలతో కూడిన సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహించనున్నారు. వ్యాసరచన, కవిత, కథ వంటి అంశాలపై జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. పుస్తక మహోత్సవానికి వచ్చే సందర్శకుల కోసం ఫుడ్ స్టాల్స్, కాఫీ దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా ప్రముఖులు గిడుగు రామ్మూర్తి, గరిమెళ్ల, కా.రా మాస్టారు, పడ్డాది పాపయ్య, గౌతు లచ్చన్న తదితరుల పేర్లతో స్వాగత వేదికలు ఏర్పాటు చేయనున్నారు. పుస్తక మహోత్సవం పేరుతో లోగోను రూపొందించి విడుదల చేయనున్నారు. వాక్ ఫర్ ది బుక్ పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పోస్టర్లను విడుదల చేయనున్నారు. సమావేశంలో తొలుత గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. సన్నాహక సమావేశంలో పలు సాహిత్య సంస్థల ప్రతినిధులు అట్టాడ అప్పలనాయుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి రమణమూర్తి, కంచరాన భుజంగరావు, చింతాడ తిరుమలరావు, బాడాన శ్యామలరావు, కె.ఉదయ్ కిరణ్, సిక్కోలు పుస్తక మహోత్సవ కన్వీనర్ కె.శ్రీనివాసు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, దుప్పల రవికుమార్, శ్రీకాకుళం అభివృద్ధి వేదిక ప్రతినిధి కొత్తకోట అప్పారావు, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధి ఎల్.రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : డిజిటల్ బుక్ పోస్టర్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులతో కలిసి వైసిపి కార్యకర్తల కోసం రూపొందించిన 'డిజిటల్ బుక్' పోస్టర్‌ను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయానికి గురవుతున్న వైసిపి కార్యకర్తల కోసం డిజిటల్ బుక్ రూపొందించ బడిందన్నారు. ప్రజల కోసం పోరాడుతూ కూటమి ప్రభుత్వం నుంచి వేధింపులకు గురైన వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని, ఎవరికి ఏ కష్టం వచ్చినా డిజిటల్ బుక్‌లో నమోదు చేయండి.. మీ తరఫున పార్టీ నిలబడుతుంది.. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి అన్యాయానికి గురవుతున్న వైసిపి కార్యకర్తలందరూ డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేసినా లేదా 040 - 49171718 నెంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి కార్యకర్తకు డిజిటల్ బుక్‌పై అవగాహన కల్పించాలని మండల నాయకులకు వివరించారు. కార్యకర్తలందరూ http://db.weysrcp.com లింక్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని అన్యాయాన్ని, నష్టాన్ని ఈ యాప్‌లో నమోదు చేయవచ్చున్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, వైసిపి మండల అధ్యక్షులు, జిల్లా అనుబంధ నాయకులు, నియోజవర్గ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గసభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : తెలుగుదేశం పార్టీ పాలనలో అన్యాయానికి గురైన వైసిపి కార్యకర్తకు అండగా డిజిటల్ బుక్ నిలుస్తుందని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సమావేశంలో నందిగా ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, వైసిపి నాయకులు సత్తారు సత్యం, ఎస్.హేమసుందర్ రాజు, తమిరి ఫాల్గుణరావు, తమ్మన్నగారి కిరణ్ పాల్గొన్నారు.

నరసన్నపేట : కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురవుతున్న కార్యకర్తలకు అండగా నిలవడానికే మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ప్రారంభించారని ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కె.సీతారాం, కణితి కృష్ణారావులు అన్నారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గురుగుపల్లి రమణి, పొందర కూరుకుల విభాగం అధ్యక్షులు రాజాపు అప్పన్న, డిఎల్‌డిఎ అధ్యక్షులు నక్క తులసీరావు, మొజ్జాడ శ్యామలరావు, వైస్ ఎంపిపి పాగొటి రాజారావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి- మందస

ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యమని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.మోహనరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి పిలుపునిచ్చారు. మందసలోని సాయికమల్ కళ్యాణ మండపంలో సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు అధ్యక్షతన ఆదివారం సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. ముందుగా హైస్కూల్ కూడలి నుంచి కొత్తవీధి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడీ కార్మికులు, రైస్ మిల్లు కార్మికులు, హమాళీలు తీవ్రమైన శ్రమ దోపిడీకి, ఆర్థిక దోపిడీకీ గురవుతున్నారని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాట్యూటీ వంటి కార్మిక చట్టాలు యాజమాన్యాలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. దీంతో కార్మికులు భద్రత లేకుండా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి, రైస్‌మిల్ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కళాసీలకు సమగ్ర చట్టం చేయాలన్నారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, తదితర స్కీం వర్కర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, కార్మికులకు ప్రాతినిధ్యం వహించే అతి పెద్ద కార్మిక సంస్థ సిఐటియు కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజం కోసం, స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో 1970లో ఐక్యత, పోరాటం నినాదంతో ఏర్పడిన సిఐటియు అనేక చారిత్రాత్మక ఉద్యమాలకు వేదిక అయ్యిందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు, కళాసీలు, కార్మికుల పక్షాన అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. పోరాటాలు, అనేక మంది త్యాగాల ఫలితంగా, ప్రజా ధనంతో నిర్మించబడిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో రూ.లక్షల కోట్ల సంపదను అదాని, అంబానీలకు, విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు దోచిపెడుతుందని అన్నారు. అక్టోబరు 5,6 తేదీల్లో సోంపేట మండలంలోని సిఐటియు జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల గౌరవాధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు మాట్లాడుతూ సంఘం ఉంటే రక్షణ కవచంగా ఉంటుందని, హక్కులు సాధించుకోవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు కోడ్లుగా మార్చివేసిందని అన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఆర్.దిలీప్ కుమార్ ఆహ్వానం పలికారు. జీడి సంఘం నాయకులు తెప్పల అజయ్‌కుమార్, యుటిఎఫ్ మండల అధ్యక్షులు జగదీష్ బడిత్య, ఎపి రైతు సంఘం నాయకులు తమ్మినేని భాస్కరరావు, హరిపురం కార్మిక, రైతు సంఘ నాయకులు నల్ల షణ్ముఖరావు సౌహార్ద సందేశం ఇచ్చారు.

మాట్లాడుతున్న నాగమణి

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా మట్ట ఖగేశ్వరరావు, మండల కన్వీనర్‌గా కె.కేశవరావు, కోకన్వీనర్‌గా ఆర్.దేవేంద్ర, ఎస్.వల్లభరావు కమిటీ సభ్యులుగా కె.కృష్ణారావు, బి.మల్లేషు, ఆర్.ఏకాశి, జి.బాలమ్మ, బి.చంద్రావతి, బి.భారతి తదితరులను ఎన్నుకున్నారు.

ఎర్రన్న విద్యా సంకల్పం
మాక్ టెస్ట్‌కు స్పందన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ఎర్రన్న విద్యా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఆర్‌ఆర్‌బి, గ్రూప్-డి అభ్యర్థుల కోసం కంప్యూటర్ బేస్డ్ మాక్ టెస్ట్‌ను నగరంలోని కాకినాడ ఆదిత్య కళాశాలలో ఆదివారం నిర్వహించారు. 244 మంది విద్యార్థులు మాక్ టెస్టుకు హాజరయ్యారు. ఆర్‌ఆర్‌బి, గ్రూప్-డి ప్రధాన పరీక్షకు సన్నద్ధం చేసే దిశగా మాక్ టెస్ట్‌ను రిజస్ట్రేషన్లు చేసుకున్న వారికి నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి చేరువ చేసే మార్గాలను దగ్గర చేస్తున్నామని చెప్పారు. డిఎస్‌సి, గ్రూప్స్, కానిస్టేబుల్, ఆర్‌ఆర్‌బి ఇలా పోటీ పరీక్షలన్నింటికీ సమాయత్తం చేసేలా యువతను సన్నద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సైతం యువత తరలివస్తున్నారని తెలిపారు. మాక్ టెస్టులు నిర్వహించడం, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందించడం, నిష్ణాతులతో తరగతులు చెప్పించడం, పరీక్షకు సన్నద్ధమయ్యేలా వారిని తీర్చిదిద్దే బాధ్యత ఎర్రన్న సంకల్పం లక్ష్యమని చెప్పారు.

మాక్ టెస్టుకు హాజరైన అభ్యర్థులు

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

దసరా రద్దీ

శ్రీకాకుళం సిటీ: దసరా సెలవులు కావడంతో ఒక్కసారిగా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికులు రద్దీ ప్రారంభమైంది. దసరా పండగ సందర్భంగా ఆర్‌టిసి జిల్లా పరిధిలోని శ్రీకాకుళం, టెక్కలి, పలాస పరిధిలోని నాలుగు డిపోలకు సంబంధించి 480 ప్రత్యేక బస్సులు వేసింది. ఈ బస్సులు సోమవారం నుంచి అక్టోబరు ఐదో తేదీ వరకు తిరగనున్నాయి. ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రయాణికుల రద్దీ ఏర్పడింది. మరోవైపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కావడంతో బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు చూపిస్తున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి అప్పలనారాయణ తెలిపారు. జిల్లా నుంచి ప్రయాణికులు రద్దీ దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్, విజయవాడ, అమలాపురం, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

సమస్యల పరిష్కారానికి లేఖలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

హిందీ భాషకు సంబంధించి పలు సమస్యలను పరిశీలించాలని ఉపాధ్యాయులు కోరారు. హిందీ భాషా పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు తపాలా కార్యాలయం వద్ద లేఖలతో కూడి కార్డులను ఆదివారం రాసి పోస్టా బాక్స్‌ల్లో వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి హిందీ భాషను బోధించాలన్నారు. ఒడియా మాధ్యమం విద్యార్థులకు ఆప్షన్ సబ్జెక్టుగా హిందీని ప్రవేశపెట్టాలన్నారు. పదో తరగతిలో హిందీ మార్కులు మిగతా సబ్జెక్టు వలె 35కు పెంచాలని కోరారు. ఇంటర్మీడియట్‌లో హిందీ తప్పనిసరి చేయాలన్నారు. సుమారు 200 రాశారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం, విద్యాశాఖ మంత్రులకు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించారు. కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు నాగేశ్వరరావు, నిరంజన్ కడంగా, చిరంజీవి, నీలకంఠం, కొండ శంకర్, రెడ్డి శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టు బాక్స్‌లో కార్డులు వేస్తున్న ఉపాధ్యాయులు

బ్యాంకు సేవలు మరింత విస్తృతం

- వ్యాపారపరంగా జిల్లాలో ప్రథమస్థానం
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం
- శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల డిసిసి కన్వీనర్ రాజా



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రస్తుత కాలానికి అనుగుణంగా బ్యాంకు సేవలు విస్తరిస్తున్నట్లు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ ముఖ్య అధికారి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల డిసిసి కన్వీనర్ పైడి రాజా అన్నారు. అన్ని తరగతుల వారు ఆర్థికసాయం కోసం బ్యాంకులపై ఆధారపడుతున్నారని అన్నారు. ప్రజలు అవసరాలు తీర్చడం, బ్యాంకులు బలోపేతం లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? బ్యాంకుపరంగా మీకు ఉన్న ప్రాధాన్యతలు ఏమిటి?

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 59 బ్రాంచ్‌లు ఉన్నాయి. జిల్లాలో అతి పెద్ద నెట్‌వర్క్ ఉన్న బ్యాంకు యుబిఐ. వ్యాపారపరంగా జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్న బ్యాంకు రీజినల్ హెడ్‌గా బలోపేతం, మెరుగైన సేవలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రజలకు అన్ని రంగాల్లో మెరుగైన బ్యాంకు సేవలు అందిస్తూ అభివృద్ధి చేయడంతో పాటు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాను జిల్లాలో ఉన్నత స్థాయిలో నిలిపడం ప్రథమ ప్రాధాన్యత.

? ప్రభుత్వ పథకాల అమలులో పనితీరు ఎలా ఉంది?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యత ఇస్తున్న పిఎం సూర్యఘర్, పిఎంఇజిపి, పిఎం విశ్వకర్మ, రైతులకు డ్రోన్లు అందజేసే రుణాలు అమలవుతున్నాయి. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష, ఫసల్ భీమా యోజన ఇలా అన్ని ప్రభుత్వ పథకాలను అన్ని తరగతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందిస్తున్నాం. జిల్లాలో 22 మంది రైతులకు డ్రోన్లకు రుణం ఇస్తే... అందులో 15 రుణాలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వారా ఇచ్చినవే. అలాగే శిక్షణ సంస్థల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా వృత్తి విద్యలో శిక్షణ ఇస్తూ... వారికి రుణాలు అందజేస్తున్నాం. వారిని వ్యాపారవేత్తలుగా మార్చడంలో కృషి చేస్తున్నాం. సాచురేషన్ డ్రైవ్ ద్వారా జిల్లాలో చాలా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

? వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం ఎలా ఉంది?

వ్యవసాయ పంట రుణాలు అందించడంతో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎప్పుడూ ముందు ఉంటుంది. అలాగే కౌలు రైతులు కార్డులు కలిగిన ప్రతిఒక్కరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు అందిస్తున్నాం. దీంతో పాటు రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు అగ్రీకల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ స్కీమ్ ద్వారా తక్కువ వడ్డీకు రుణాలు అందిస్తున్నాం. రైస్ మిల్లర్లకు, ట్రాక్టర్లకు, వ్యవసాయ ఉపకరణాలు కొనుగోలుకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇస్తున్నాం. ఇక వ్యాపార వేత్తలకు స్టాండప్ ఇండియా, ముద్ర, పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎం ద్వారా రుణాలు అందిస్తున్నాం. చాలా తక్కువ వడ్డీకి పరిశ్రమల స్థాపనకు రుణాలు ఇస్తున్నాం.

? ఇళ్లు, వాహనాలు, వ్యక్తిగత రుణాలు విషయంలో ఎటువంటి స్కీమ్స్ అందిస్తున్నారు?

గృహ రుణాలకు ఎటువంటి ప్రొసెసింగ్ ఫీలేకుండా 7.35 శాతం వడ్డీకి, అలాగే వాహన రుణాలకు 7.90 శాతం వడ్డీతో ఎటువంటి ప్రొసెసింగ్ ఫీ లేకుండా ఇస్తున్నాం. అలాగే వ్యక్తిగత రుణాలు రూ.25 లక్షల వరకు అతి తక్కువ వడ్డీ ధరకు ఒక్క రోజులోనే అప్రూవల్ ఇస్తున్నాం. గృహ, వాహన రుణాలు అతి తక్కువ సమయంలో మంజూరు చేస్తున్నాం.

? ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్న రుణ సౌకర్యాలు ఎలా ఉన్నాయి?

ఇటీవల యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోటి ప్రమాద బీమా, రూ.10 లక్షల సాధారన బీమా, అలాగే గృహ రుణాల్లో వడ్డీ రాయితీ, శాలరీ ఓవర్డ్రాఫ్ట్ సదుపాయం కల్పిస్తుంది. దీనికి ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

? సామాజిక బాధ్యతలో మీ బ్యాంకు ప్రాధాన్యత ఏంటి?

కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ ద్వారా మౌలిక సదుపాయాలు, అవగాహనా సదస్సులు, సేవా కార్యక్రమాలు, విద్యాలయాలకు, ఆస్పత్రులకు, ఆలయాలకు సిఎస్ఆర్ యాక్టివిటీస్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నాం. మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

సిఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నియోజక వర్గ సమస్యలపై సిఎం చంద్రబాబు నాయుడును కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ సమస్యలు వివరించారు. ఈ మేరకు ఆయన తీసుకువెళ్లిన సమస్యలు ఆదివారం వివరించారు. గత కొన్నేళ్లుగా చారిత్రక ప్రసిద్ధిగాంచిన జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. ఆమదాలవలస రైల్వేస్టేషన్ నుంచి పాలకొండ రోడ్డు వరకు రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలియజేశానన్నారు. కళింగపట్నం ప్యాసింజర్ జెట్టీ నిర్మాణానికి సంబంధించి ప్రస్తావించినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

నూతన కార్యవర్గానికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న నారాయణరావు

జెఎల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలురు)లో జూనియర్ లెక్చరర్ల జిల్లా సంస్థాగత ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షునిగా నరసన్నపేట కళాశాలకు చెందిన డాక్టర్ హెచ్.మల్లేష్, ఉపాధ్యక్షునిగా బి.వెంకట మోహన్, కార్యదర్శిగా డాక్టర్ ఎస్.రమేష్, జాయింట్ సెక్రటరీగా పెనుగుదురు ప్రసాదరావు, ఇతర కార్యవర్గ సభ్యులుగా ఎ.ధనుంజయరావు, డాక్టర్ సయ్యదా భాను, వై.వి.కృష్ణమూర్తి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, పంచాయతీరాజ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు కె.నారాయణరావు ప్రకటించారు. నూతన కార్యవర్గం పదవీకాలం మూడేళ్ల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. రెగ్యులర్ జూనియర్ లెక్చరర్ల సంస్థాగతమైన సమస్యలు, పదోన్నతులు, ఇతర విషయాలపై ఉన్నతాధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని నూతన అధ్యక్షుడు డాక్టర్ మల్లేష్ పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.

క్రీడాకారులను అభినందిస్తున్న రాజశేఖర్

క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

పలాస రైల్వే మైదానంలో అండర్-12 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ పోటీల్లో పది క్రికెట్ టీమ్‌లు పాల్గొంటున్నాయి. మొదటి రోజు ఆంధ్రా, ఒడిశా, పలాస రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ యూనియన్ నాయకులు, నరసన్నపేట యంగ్ క్రికెట్ అసోసియేషన్ ఆర్‌జె క్రికెట్ క్లబ్‌లు తలబడ్డాయి. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐ ఆర్ వర్కింగ్ కమిటీ మెంబర్ సిర్ల రాజశేఖర్ మాట్లాడుతూ ఆటలు మనిషికి మానసిక, శారీరిక ఆరోగ్యం, ఆనందం ఇస్తుందని అన్నారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ క్రీడలు గెలుపు, ఓటమిలను ఒకేలా స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ నాయకులు పి.వి.వి.రావు, విక్రమ్ రామారావు, ఆర్.భీమారావు, బివైబిఎం నాయుడు, రవిచౌదరి దువ్వాడ, ఆర్.భాస్కరరావు, రైల్వే సిఐ ఇలియాస్ అహ్మద్, క్రికెట్ కోచ్‌లు జగదీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

కష్టపడే వారిని గుర్తించాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం జనసేన అదినాయకత్వంలోని సమన్వయ లోపంతో కష్టపడ్డ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని నాయకులు రొక్కల్లా భాస్కరరావు, కంచిలి మండలం జలంత్రకోటకు చెందిన డొక్కరి సోమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్‌ను ఆదివారం కలిశారు. జనసేన అంతర్గత విషయాలపై చర్చినట్లు వారు తెలిపారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనసేన అదినాయకత్వం లోపాల వల్ల కష్టపడే జన సైనికుల మధ్య సమన్వయ లోపం ఉందన్నారు. వీర మహిళలకు గుర్తింపే లేదన్నారు. వారు అసంతృప్తిలో ఉన్నారని అన్నారు. అందుకు కష్టపడే వారిని గుర్తించాలని కోరారు.

ఎస్‌జిఎఫ్ అండ

కవిటి: ఇంటి పెద్దను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలిచిన స్పెషల్ గైస్ ఫౌండేషన్ మరోసారి తన దాతృత్వం చాటుకుంది. మండలంలోని గుజ్జుపుట్టుగకు చెందిన మురపాల దుర్యోధన కాలేయ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం దయనీయ స్థితిలో ఉంది. స్థానిక యువత ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని తమ సంస్థ ద్వారా ఆ కుటుంబానికి రూ.10 వేలు అందించారు. అదేవిధంగా సంస్థ ముఖ్య సభ్యులు ఢిల్లేష్ రూ.వెయ్యి, శ్రీకాంత్ రూ.వెయ్యి అందించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న దుర్యోధన కుటుంబానికి దాతలు అండగా నిలవాలని కోరారు.

గోపీనాథపురం అభివృద్ధిలో వివక్ష

- నిలిచిన నిర్మాణ పనులు
- వైభవం కోల్పోతున్న ప్రాంతం

నిరుపయోగంగా ఉన్న పాత ఆస్పత్రి క్వార్టర్స్

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని గోపీనాథపురం ప్రాంతం అభివృద్ధిపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వివక్షత చూపుతున్నారని ఆ ప్రాంతీయులు భావిస్తున్నారు. ఒకప్పుడు జన సంచారంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలకపాత్ర పోషించిన ప్రముఖులు, చరిత్ర పుటల్లోకి ఎక్కిన చారిత్రాత్మక వ్యక్తులు సంచరించే ఈ ప్రాంతం. పట్టణ అభివృద్ధికి కీలక ప్రదేశంగా మిగిలిన గోపినాథపురం ప్రాంతంపై పాలకులు, అధికారులు దృష్టి పెట్టడం లేదు. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని మున్సిప్ మెజిస్ట్రేట్ కోర్టు భవన నిర్మాణాలకు విధులు వెచ్చించినా పనులు పూర్తి చేయలేదు. టెక్కలి పట్టణం ఆవిర్భావం నుంచి ఈ ప్రాంతంలోని జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రిని తరలించారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వృథాగా ఉన్న పాత ఆస్పత్రి భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను పక్కనబెట్టి నిర్లక్ష్యం చేశారని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలోని హుదూద్ ఇళ్ల పంపిణీకి నోచుకోకపోవడం, రైతుబజారు నిర్మాణం జరిగినా ప్రారంభం కాకపోవడం వంటి సమస్యలతో ఈ ప్రాంతీయులు ఉన్నారు. రావివలస, మూలపేట పోర్టు, నౌపడ రైల్వే కూడలి, తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రం వంటి ప్రదేశాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రోడ్డు. అయినా ఈ ప్రాంతం అభివృద్ధిపై పాలకుల శీతకన్ను పడింది. ప్రస్తుతం టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం, డివిజన్ స్థాయి రోడ్ల భవనాల శాఖ కార్యాలయాలు ఉన్నాయి. వాటి అభివృద్ధిపైనా నిర్లక్ష్యం చోటుచేసుకోవడంతో ఈ ప్రాంతీయులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి పంచాయతీలో ప్రధానమైన ప్రాంతంగా ఉన్న గోపినాథపురానికి చెందిన ప్రపంచ కవి, బహు భాషాకోవిదుడు, ఆచార్య రోణంకి అప్పలస్వామి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ ఆవార్డు గ్రహీత హనుమంతు వీరన్న మాస్టార్, ఉత్తమ ఉపాధ్యాయ ఆవార్డు గ్రహీత మట్ట లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ సీనియన్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సత్తారు లోకనాథం నాయుడు, ఐపిఎస్ సత్తారు ఉమాపతి, ఎన్ఆర్ఐ దవళ వెంకటగిరిబాబు వంటి ప్రముఖులు ఈ ప్రాంతీయులు కావడం గమనార్హం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దామోదరరావు (ఫైల్)

నరసన్నపేట: పోలాకి మండలంలోని గాతలవలసకు చెందిన బమ్మిడి దామోదరరావు (54) ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామోదరరావు నరసన్నపేటలోని మేఘన హోటల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. శనివారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. జాతీయ రహదారిలో రోడ్డు దాటుతుండగా, శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో దామోదర రావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ అర్థరాత్రి పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య వీరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం సిటీ: రామలక్ష్మణ జంక్షన్ నుంచి సూర్యామహల్ వైపుగా నడుచుకుంటూ వెళ్తున్న 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గల్ల లుంగీ, చొక్కా వేసుకున్న ఈయనను పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టగా రోడ్డుపై పడిఉన్నాడు. తలపైన, ముక్కుపైన, కాలి ముడుకు బలమైన రక్తగాయ లయ్యాయి. 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న వ్యక్తిని మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలిస్తున్నారు. స్పృహలో లేని వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిసినట్టయితే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో, 9494 694956, 6309990809 నంబర్లకు తెలియ జేయాలని ట్రాఫిక్ ఎస్ఐ ఎం.సుధాకర్ కోరారు.

క్షతగాత్రున్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

లేడీస్ కార్నర్‌లో అగ్ని ప్రమాదం

టెక్కలి రూరల్ : టెక్కలి ఎన్‌టిఆర్ కాలనీ 10వ లైనులోని లేడీస్ కార్నర్‌లో శనివారం అర్థరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ప్రమాదంలో వస్తువులు, చీరలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న టెక్కలి అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లిందని యజమాని దమయంతి వాపోయారు.

దగ్ధమైన సామగ్రి

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

లావేరు: దసరా నవరాత్రుల సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో గ్రంథాలయానికి వస్తున్న విద్యార్థులకు దాతల సహాయం నుంచి ఈ పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకట రాజారావును సన్మానిస్తున్న ప్రతినిధులు

'కుప్పిలి'కి సత్కారం

ఆమదాలవలస: గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఉషా పత్రిక ఆధ్వర్యంలో విశాఖపట్నం సాగరిక కన్వెన్షన్ హాల్‌లో జయంతి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన రచయిత, కవి కుప్పిలి వెంకట రాజారావుకు ఘన సత్కారం లభించింది. ఉషా పత్రిక నిర్వాహకులు తాతారావు, బిజెపి ప్రతినిధి సుహాసిని కుప్పిలి వెంకట రాజారావుకు సాలువ కప్పి స్మారక చిహ్నం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రాజారావు మాట్లాడుతూ గుర్రం జాషువా వంటి మహాకవి జయంతి వేడుకల్లో ఇంతటి సత్కారం పొందడం తనకు గొప్ప గౌరవమని, ఇది తనకు మరింత సృజనాత్మకతకు ప్రేరణ కలిగిస్తుందని తెలిపారు.

హెచ్‌ఎంకు బీరువాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు బీరువాలు అందజేత

పొందూరు: మండలం కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు తమవంతు సాయంగా రెండు ఇనుప బీరువాలను అందజేశారు. పాఠశాల గ్రంథాలయంలో పుస్తకాలను భద్రపరచుకునేందుకు వీలుగా ఈ బీరువాలను అందజేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతాడ గోవిందరాజులు, పూర్వ విద్యార్థులు దుంపల శ్రీనివాసరావు, బెండి సూరపనాయుడు, కంచరాన లక్ష్మణ్‌నాయుడు, సింగూరు విశ్వనాథం, ఎ.నరసింహులు, బాడన ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో దళితవాడల అభివృద్ధి

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని దళితవాడల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయటం హర్షణీయమని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ సభ్యులు తోట రాము అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో దళితవాడలు ఏ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి రూ.కోటి నిధులు మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం దళితులు, గిరిజనుల ప్రాంతాలను గుర్తించి పక్కా రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. జిల్లా దళిత సంఘ నాయకులు పొన్నాడ అప్పలసూరి, గుర్రాల చినబాబు, సవలాపురపు రాజారావు పాల్గొన్నారు.

విప్ సతీమణి సందర్శన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం గ్రామ దేవత స్వేచ్ఛావతి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల ఆలయాన్ని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పత్రీ తవిటియ్య, కొండ శంకర్‌రెడ్డి, నందికి జాని, కృష్ణయ్య, దట్టి శ్రీను, బర్ల హైమావతి, కాళ్ల జయ, గిన్ని వెంకట రమణ, కొర్రాయి ధర్మరాజు, రెయ్య జానికిరామ్, ఆసి మోహన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిరణ్ కుమార్

జగన్‌ను విమర్శించే స్థాయి లేదు

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక వైసిపి కార్యాలయంలో అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిపై చేసిన వాఖ్యలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డిని విమర్శించే నైతికహక్కు బాలకృష్ణకు లేదన్నారు. తుపాకీ కాల్పుల్లో జైలు పాలవ్వాల్సిన బాలకృష్ణకు బిక్ష పెట్టిన ఘనత ఆనాటి సిఎం రాజశేఖర్ రెడ్డి అని గుర్తు చేశారు. అదే విధంగా జగన్ సిఎంగా ఉన్నప్పుడు బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి కోట్లు నిధులు సిఎం సహాయనిధి ద్వారా మంజూరు చేసిన విషయం మరిచి మాట్లాడుతున్నారా అన్నారు. బాలకృష్ణ తక్షణమే జగన్మోహన్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, వైసిపి మండల అధ్యక్షులు, జిల్లా అనుబంధ నాయకులు, నియోజవర్గ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ సిఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఎచ్చెర్ల వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మాజీ అధ్యక్షులు మహంతి పెదరామునాయుడు, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు, మహంతి చిన్న రామునాయుడు, మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్ము నాయుడు, మాజీ ఎంపిటిసి మింది శ్రీనివాస్ రెడ్డి, సోషల్ మీడియా ఆక్టివిస్ట్ కరిమజ్జి రమణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం చేస్తున్న స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పెద్దలను గౌరవిద్దాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్టార్ వాకర్స్ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో వయోవృద్ధులకు సన్మానాలు నిర్వహించారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా డిగ్రీ కళాశాల మైదానంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వయోవృద్ధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి యునియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోవృద్ధులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నాయని, బ్యాంకులు కూడా వారికి వడ్డీ రాయితీలు ఇచ్చి, సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై మిగతా వారి కంటే అధిక వడ్డీని కూడా అందిస్తూ, వారికి అవసరమైన ఆర్థిక మద్దతు అందజేస్తున్నాయన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో-ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పూర్వపు గవర్నర్, స్టార్‌వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు గేదెల ఇందిరా ప్రసాద్, స్టార్‌వాకర్స్ క్లబ్ మెంబర్స్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, అంకడాల తవిటన్న, గేదెల లక్ష్మీ, గుడ్ల జగ్గారావు, గోలీ ఉమామహేశ్వరరావు, డాక్టర్ జి.ఎన్ రావు, వై.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నిమ్మన దాసు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన మండల సమావేశం సాదాసీదాగా సాగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్నారు. అనంతరం సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. అనంతరం ఎమ్మెల్సీకి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి గుర్రాల శ్రీను, జెడ్‌పిటిసి తడక యశోద జోగారావు, ఎంపిడిఒ ఈశ్వరమ్మ, గౌరవ అతిథులు ఇందుగు లక్ష్మీనారాయణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

దుదిష్టి మజ్జికి కీర్తి పతాకం

ప్రజాశక్తి- కవిటి

విజయనగరంలో ఆదివారం నిర్వహించిన 32వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలో మండలంలోని తిప్పన పుట్టుగ యువకుడు ప్రతిభ చాటాడు. 55 కేజీ విభాగంలో 24 మంది బాడీ బిల్డర్లతో పోటీపడుతూ కవిటి డియర్స్ ఫిట్నెస్ జిమ్ సెంటర్ కోచ్ దుదిష్టి మజ్జి మూడో స్థానం కైవసం చేసుకుని కవిటి, ఇచ్ఛాపురం ప్రాంతాలకు గర్వకారణంగా నిలిచాడు. ఈ విజయంతో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్, స్థానిక బాడీ బిల్డర్స్, కవిటి ప్రజల తరుపున ప్రత్యేక అభినందనలు అందుకున్నాడు.

దుదిష్టి మజ్జి రాబోయే పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని, యువతకు ఆదర్శంగా నిలవాలని స్థానికులు ఆకాంక్షించారు.

ట్రోఫీతో దుదిష్టి మజ్జి

డ్రోన్‌లో జిల్లేడు ద్రావణం వేస్తున్న సిబ్బంది

జిల్లేడు ద్రావణం పిచికారీ

ప్రజాశక్తి- నరసన్నపేట

జిల్లేడు ద్రావణం వల్ల వరి పంటకు రసాయన ఎరువులు వాడకం తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ సూచించారు. మండలంలోని దేవాదిలో గొండు. సూర్యారావు, గొండు లక్ష్మణరావు, బాగిరెడ్డి రామారావు, యాల్ల రాజ్యలక్ష్మి, సిమ్మ శ్రీనివాసరావు, ధర్మాన నరసింహులు, గంగరాపు వెంకటరమణ, ధర్మాన శ్రీరాములు ప్రకృతి వ్యవసాయ రైతులతో వరి పొలాల్లో సామూహికంగా 35 ఎకరాల్లో జిల్లేడు ద్రావణం డ్రోన్‌తో స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లేడు ద్రావణం పిచికారీ చేయడం వల్ల వరి పంటలో రసం పిలిచే పురుగుల నివారిస్తాయని అన్నారు. అలాగే పంట దుబ్బు పెరుగుతుందన్నారు. వరి చేను నల్లగా మారి గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. మొక్కకి నత్రజని, భాస్వరం పొటాషియం అందిస్తుందని తెలిపారు. రసాయన ఎరువుల లేని లోటు తీరుస్తుందని చెప్పారు. అలాగే డ్రోన్ వల్ల రైతుకు ఖర్చు తగ్గుతుందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్ సహాయంతో స్ప్రేయింగ్ చేయవచ్చునని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ రైతుకు ప్రకృతి వ్యవసాయంపై సలహాలు, సూచనలు అందించారు. సిబ్బంది కె.రాజేశ్వరమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్వాతంత్రోద్యమ నిప్పుకనిక భగత్‌సింగ్ చరిత్రలో ఎప్పుడు సజీవంగా నిలిచిపోయారని వక్తలు పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు గుండెల్లో భగత్ సింగ్ స్ఫూర్తి నిరంతరం కొనసాగుతోందన్నారు. పట్టణంలోని గాంధీమందిరం స్వాతంత్ర సమరయోధుల సంఘ సంస్కర్తల స్మృతి వనంలో భగత్‌సింగ్ జయంతి ఆదివారం నిర్వహించారు. విగ్రహదాతలు నేమాని వేదవతి, శ్యాంప్రసాద్ బృందంతో పాటు గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్, మహిబుల్ల ఖాన్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, జామి విద్యాధరి, జామి అనురాధ, ఊన్న తీర్థ, మెట్ట అనంతం భట్లు బృందం భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రోధ్యమంలో కీలకమైన పోరాట దశలో భగత్ సింగ్ చూపిన తెగువ యావత్ భారతావనికి జీవం పోసిందన్నారు. బ్రిటిష్ అధికారుల ఆగడాలను 24 ఏళ్ల వయసులోనే ఎదిరించిన ధీశాలి భగత్ సింగ్ అని కొనియాడారు. భగత్ సింగ్ గొప్పతనాన్ని వివరిస్తూ అవధాన పండితులు పైడి హరనాథరావు గేయాన్ని ఆలపించారు. కార్యక్రమంలో తమ్మినేని ఉషారాణి, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, శాస్త్రి, సువ్వారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో మహిళ మృతి

వెంకటమ్మ (ఫైల్)

పొందూరు: మండలం కృష్ణాపురంలో కిడ్నీ వ్యాధితో గార వెంకటమ్మ (48) ఆదివారం మృతి చెందింది. ఈమె గత రెండేళ్లుగా డయాలసిస్ చికిత్స పొందుతుంది. ఈమెకు భర్త రమణ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో ఇప్పటికే సుమారుగా 20 మంది ఈ వ్యాధితో మరణించగా, పదుల సంఖ్యలో కిడ్నీ సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వారు ఉన్నారు. వైద్యాధికారులు, ప్రభుత్వం వెంటనే గ్రామంలో కిడ్నీ పరీక్షలు జరిపి సమస్య ఎక్కడి నుంచి వస్తుందో గుర్తించాలంటూ ప్రజలు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

విస్తృత తనిఖీలు

మెళియాపుట్టి: మండలంలోని మెళియాపుట్టి, చాపర, జాడుపల్లి తదితర గ్రామాల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్స్‌తో ఆదివారం దుకాణాలను, వాహనాలను తనిఖీ నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలు, ఇతర అక్రమ రవాణాలను అరికట్టేందుకు పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రమేష్‌బాబు, ఎఎస్ఐ బి.అప్పన్న, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్నాథం నాయుడు

మత్తుకు బానిస కావద్దు

రణస్థలం: యవత మత్తు పదార్థాలకు బానిస కావద్దని టిడిపి నాయకులు పిసిని జగన్నాథం నాయుడు పిలుపు నిచ్చారు. డ్రగ్స్ తాత్కాలికంగా ఆనందం ఇచ్చినట్టు అనిపించినా, అవి ఆరోగ్యాన్ని నాశనం చేయడమే కాకుండా కుటుంబాన్ని కూల్చేస్తాయన్నారు. దుర్గా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా కోష్టలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రగ్స్‌కు ఒకసారి అలవాటు పడితే క్రమంగా మంచి భవిష్యత్ మసక బారిపోతుందన్నారు. మంచి స్నేహితులను సంపాదించుకుని ప్రశాంత జీవితం గడపాలని, బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల కళలను నిజం చేయాలని కోరారు. ఎంపిటిసి పిసిని ఆసిరినాయుడు, యువ నాయకులు పిసిని హరికృష్ణ, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేస్తున్న గ్రామస్తులు

రట్టినిలో పారిశుధ్య పనులు

మెళియాపుట్టి: మండలంలోని రట్టినిలో ఆదివారం పారిశుధ్య పనులను సర్పంచ్ శ్యామల జన్న ఆధ్వర్యాన నిర్వహించారు. గ్రామంలోని ముఖ్య రహదారులు, వీధులు, డ్రైనేజీలు, చెత్త సంపద కేంద్రాల ఆవరణలో చెత్తా చెదారాలను తొలగించారు. అనంతరం ల్లో బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేశారు. ప్రజలకు ఆరోగ్యభద్రత కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలోని పరిశుభ్రత విషయంలో ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. జనసేన నాయకులు, ఎఎంసి డైరెక్టర్ చింతల ప్రశాంత్, నరేష్, తరుణ్, చరణ్ పాల్గొన్నారు.

సూదికొండలో అన్నదానం

పలాస : కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో దేవీనవరాత్రులో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో శిష్టు గోపి, సీపాన ఈశ్వరరావు, బగాది సింహాచలం, కొనారి అది, బోనెల శ్రీకాంత్, జోగి పవన్, పినమింటి ఎర్రన్నాయుడు, లండ నారాయణ, సీపాన శ్రీకాంత్, బోనెల ప్రకాష్, శివ, రామారావు, నిమ్మారావు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

జాషువా రచనలు ఆదర్శం

శ్రీకాకుళం : గుర్రం జాషువా అణగారిని తరగుతల ఆవేదనకు అక్షర రూపం అని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సీర రమేష్‌బాబు అన్నారు. నగరంలోని స్థానిక జ్యోతిరావు పూలే పార్కులో ఉన్న జాషువా విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా గబ్బిలం మొదలైన ఎన్నో రచనల ద్వారా అణగారిన తరగతులు పడిన పడ్డ మానసిక, శారీరక, సాంఘిక సంఘర్షణలను సమాజం ముందు ఉంచారని కొనియడారు. 'కల ఖడ్గంతో కుల కుళ్లును ఛేదించి బడుగు బలహీనుల, అణగారిన తరగతులు, దళితుల మనోవేదననను, నాటి సమాజానికి పూసగుచ్చినట్లు వివరించారని అన్నారు. అక్షర యోగి, ఇది నా స్థితి, నా సమాజ పరిస్థితి అని అప్పటి సమాజానికి ధైర్యంగా చాటి చెప్పిన ధైర్యశాలిని అన్నారు. అక్షరావేదనతో, బరువెక్కిన గుండెతో, అక్షర సేద్యం చేసి ఆయన అందించిన గ్రంథాలు ఈనాటి పరిస్థితులకు కూడా సజీవ సాక్ష్యాలని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నింటి వెంకటరమణ, సీనియర్ దళిత నాయకులు కల్లేపల్లి రాంగోపాల్, డాక్టర్ కంట వేణు, ఎడ్ల జానకిరావు, సాంబారికి సూర్యనారాయణ పాల్గొన్నారు.

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు